రోడ్డు పనులు ప్రారంభం

ప్రజాశక్తి-జిమాడుగుల: మండలంలో వంతాల పంచాయతీ వేలంగరువు గ్రామంలో 200 మీటర్ల సిసి రోడ్డు నిర్మాణ పనులను సోమవారం స్థానిక సర్పంచి జి పద్మ, వైస్ ఎంపీపీ వి.కళ్యాణి, వైస్ సర్పంచ్ పి తిరుపతమ్మ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఈ గ్రామంలో సుమారు 40 కుటుంబాల ప్రజలు రోడ్డు లేక వర్షాకాలంలో తీవ్ర ఇబ్బందులు పడేవారని, ఇప్పుడు ఆ ఇబ్బందులు పూర్తిగా తొలగిపోతాయని అన్నారు.ఈ కార్యక్రమంలో వార్డు నెంబరు చినరాజులమ్మ, జయసుధ ,పిసా కార్యదర్శి పి మహేష్. సింగం నాయుడు పాల్గొన్నారు.

పనులను ప్రారంభిస్తున్న సర్పంచ్

తాగునీటి సమస్యను పరిష్కరించాలి

- ఖాళీ బిందెలతో మహిళల నిరసన - తక్షణమే అధికారులు స్పందించాలి : సిపిఎం

ప్రజాశక్తి-అరకులోయరూరల్: మండలంలోని మాడగడ పంచాయతీ కేంద్రంలోని తాగునీటి సౌకర్యం కల్పించాలని సిపిఎం ఆధ్వర్యంలో సోమవారం మహిళలు ఖాళీ బిందెలతో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి కె రామారావు మాట్లాడుతూ, మాడగడ గ్రామంలో సుమారు 500 గిరిజన కుటుంబాలు నివాస్తున్నాయని, తాగు నీరు లేక తీవ్ర ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. గ్రామంలో ప్రతి ఏడాది వేసవి కాలం మంచినీరు కోసం సమస్య తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. గ్రామంలో వాటర్ ట్యాంక్ ఉన్నప్పటికీ పూర్తిస్థాయిలో తాగునీరు అందడం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నట్లు పేర్కొన్నారు. అధికారులకు, ప్రజాప్రతినిధులకు ఎన్నిసార్లు తాగునీటి సమస్యపై విన్నవించినా పట్టించుకునే పరిస్థితి లేదని ఆయన అన్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి తక్షణమే మాడగడ గ్రామంలో తాగు నీటి సమస్య పరిష్కరించి పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మహిళలు బి మొంగ్లి, శిరగం జమున, జె రంబ,ప పీ బుద్రి,టి చంద్రకళ, కొర్రా చంప, మజ్జి రాధమ్మ,గొల్లొరి సుమిత్ర,బురిడీ ఉషా,సొన్ను, చైతోన్ , తదితరులు పాల్గొన్నారు.

అరకులోయ రూరల్: మండలంలోని బస్కి పంచాయతీ జాకరవలస గ్రామంలో తాగు నీరు సౌకర్యం కల్పించాలని సిపిఎం మండల కార్యదర్శి కిండంగి రామారావు డిమాండ్ చేశారు. సోమవారం గ్రామంలో పర్యటించి గ్రామస్తులతో కలిసి వాటర్ ట్యాంక్ వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బస్కి పంచాయితి జాకరవలస గ్రామంలో కేంద్ర ప్రభుత్వం జల్ జీవన్ మిషన్ పథకం కింద ఇంటింటి కొళాయి ఏర్పాటు చేసి తాగు నీరు అందించాలని ఉద్దేశంతో పథకం ప్రారంభించారని, ఈ పథకాన్ని గుత్తేదారుడు పనులు పూర్తి చేయకుండా మధ్యలోనే పనులు నిలిపి వేశారన్నారు. దీంతో గ్రామస్తులు తాగునీరుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. గ్రామంలో గ్రావిటి స్కీం పథకం ద్వారా కొళాయి ఉన్నప్పటికీ ప్రస్తుతం ఎండాకాలం రావడంతో నీరు ఇంకిపోయి చుక్క నీరు దొరకని పరిస్థితి ఉందన్నారు. వర్షాకాలంలో గ్రావిటీ ద్వారా వస్తున్న నీరు బురదగా వస్తుండడంతో అనారోగ్యం పాలవుతున్నారన్నారు. తక్షణమే జల్ జీవన్ మిషన్ పథకం ద్వారా పనులు పూర్తిచేసి సురక్షిత మంచినీరు అందించాలని డిమాండ్ చేసారు. ఈ కార్యక్రమంలో కిల్లో ధనుర్జయ్, కిల్లో డొంబాయ్, కిల్లో గీత, కిల్లో సొనదోయ్, కిల్లో ప్రమిల, కె.చందోర్, కిల్లో చైతోన్,తదితరులు పాల్గొన్నారు.

జాకరవలసలో ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న మహిళలు, సిపిఎం నేతలు

మెయిన్‌రోడ్డుపై భారీ మొసలి హల్‌చల్

సీలేరు మెయిన్‌డ్యాం చివరన యథేచ్ఛగా సంచారం

హడలిన వాహనదారులు..సురక్షితంగా నదిలోకి తరలింపు

సీలేరు మెయిన్‌డ్యాం గట్టున ఉన్న మొసలిని చూపుతున్న జెన్‌కో ఎఇఇ సురేష్

ప్రజాశక్తి -సీలేరు: ఆంధ్ర ఒడిశాసరిహద్దు సమీపంలో సీలేరు మెయిన్ డ్యామ్ చివరన ఆదివారం అర్ధరాత్రి భారీ మొసలి రోడ్డుపై హల్‌చల్ చేసింది. రోడ్డెక్కిన మొసలిని చూసిన ఎపి జెన్‌కో మెయిన్‌డ్యాం భద్రతా సిబ్బంది తీవ్ర భయాందోళన గురయ్యారు.

ఆదివారం అర్ధరాత్రి ఒడిశా నుంచి బొలెరో పికప్ వాహనం వస్తుండగా, డ్యాము శివారున రహదారిపై ఎనిమిది అడుగులు భారీ మొసలి కంటబడింది. దీంతో వాహనాన్ని నిలిపేసిన డ్రైవర్, అక్కడ విధులు నిర్వహిస్తున్న డ్యాం సెక్యూరిటీ సిబ్బందికి సమాచారం ఇచ్చారు. వెంటనే సెక్యూరిటీ సిబ్బంది మొసలి ఉన్న ప్రదేశాన్ని వెళ్లి పరిశీలించారు. ఏంచేయాలో తెలియక ఎపిజెన్‌కో క్యాంపు ఎఇఇ సిహెచ్ సురేష్‌కు విషయాన్ని తెలియజేయగా, ఆయన మెయిన్ డ్యామ్‌కు మొసలిని ప్రత్యక్షంగా చూసి ఉలిక్కిపడ్డారు. అనంతరం సెక్యూరిటీ సిబ్బంది సహకారంతో మొసలిని సీలేరు నదిలోకి సురక్షితంగా వెళ్లేలా ఎఇఇ సురేష్ చర్యలు చేపట్టారు.

జెన్‌కో ఎఇఇ, సెక్యూరిటీ సిబ్బంది, వాహనడ్రైవర్ ఇలా పలువురు అలికిడి ఉన్నప్పటికీ, మొసలి తొణుకుబెణుకు లేకుండా రోడ్డుపైనే తిష్టవేయడంతో దాని తరలించడానికి కొంచం ఇబ్బంది పడ్డారు. అయితే బొలెరో వాహనం హెడ్‌లైట్లు దాని కళ్లల్లో పడేలా వేయడంతో మెళ్లగా డ్యాం గోడ పైకెక్కి అలా సీలేరు నదిలోకి వెళ్ళిపోయింది. దీంతో సెక్యూరిటీ సిబ్బందితోపాటు ఈ మార్గంలో ప్రయాణించే వారంతా ఊపిరి పీల్చుకున్నారు. గత ఏడాది కూడా దిగువ సీలేరు డొంకరాయి రిజర్వాయర్ వద్ద మొసలి హల్‌చల్ చేసిన విషయం తెలిసిందే. తాజా ఘటనతో డొంకరాయితోపాటు సీలేరు ఎపి జెన్‌కో రిజర్వాయర్‌లోనూ, సీలేరు నదిలోనూ మొసళ్ల సంచారం ఉన్నట్లు స్పష్టం కావడంతో ఎపుడు ఎటువైపు నుంచి మొసళ్లతో ప్రమాదం ముంచుకొస్తుందోననని స్థానికులు భయాందోళనలకు గురౌతున్నారు.

ప్రభుత్వ పథకాలపై అవగాహన

మాట్లాడుతున్న సంస్థ సభ్యులు

ప్రజాశక్తి-హుకుంపేట: మండలంలోని సంతారి, రాప పంచాయతీలలో 81 మంది ఆదివాసీ యువతకు ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వ పథకాలపై సోమవారం అవగాహన కల్పించారు. నేచర్ సంస్థ ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ పండోయ్ రవి కుమార్ పాల్గొని ప్రభుత్వ పథకాలు, హక్కులు, అర్హత ప్రమాణాలు, ప్రస్తుత అమలులో ఉన్న పథకాల గురించి వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ముఖ్యమైన ఉద్యోగ సూచనలు, స్థానిక పాలన, వనరుల మ్యాపింగ్, గ్రామాభివృద్ధి, డిజిటల్ సౌకర్యాలపై యువతకు అవగాహన కల్పించారు.ఆధార్, పీఎం కిసాన్‌తో పాటు భూ వివరాలపై వివరించారు. గ్రామస్తులు శిక్షణ ద్వారా నేర్చుకున్న విషయాలపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సృజన స్వచ్ఛంద సిబ్బంది మత్యరాజు, లక్ష్మన్, కొండబాబు, నూకరాజు, అర్జున్, రామారావు, రంగబాబు, బాబురావు తదితరులు పాల్గొన్నారు.

వైసిపి విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షునిగా వరప్రసాద్

ప్రజాశక్తి- చింతపల్లి: వైసిపి అల్లూరి జిల్లా విద్యార్థి విభాగం అధ్యక్షుడిగా లంబసింగికి చెందిన లోచల వరప్రసాద్ నియమితులయ్యారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కేంద్ర పార్టీ కార్యాలయం నుంచి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆయన పార్టీ జిల్లా అధ్యక్షులు, పాడేరు శాసనసభ్యులు మత్స్యరాస విశ్వేశ్వర రాజు, మాజీ ముఖ్యమంత్రి, వైకాపా అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. బాధ్యతలు స్వీకరించిన వరప్రసాద్ మాట్లాడుతూ, పార్టీ బలోపేతానికి అహర్నిశలు కృషి చేస్తానని,విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు తన వంతు పోరాటం చేస్తానని అన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వ పాలనలో పాఠశాలల్లో చదువుతున్న ఎంతోమంది విద్యార్థులు మృత్యువాత పడుతున్న సంఘటనలు ఉన్నాయన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక విద్యార్థులకు అందించాల్సిన సంక్షేమ పథకాలను నిర్లక్ష్యం చేసిందన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు వరప్రసాద్‌కి అభినందనలు తెలియజేశారు.

అభినందిస్తున్న ఎమ్మెల్యే

పౌష్టికాహారం పంపిణీ

ప్రజాశక్తి- నర్సీపట్నం టౌన్ : నర్సీపట్నం ప్రాంతీయ గవర్నమెంట్ హాస్పిటల్‌లో శ్రీ సత్య సాయి సేవ సమితి ఆధ్వర్యంలో సోమవారం 70 మంది గర్భిణీ స్త్రీలకు ప్రేమామృత ప్రసాదం (ప్రోటీన్ పుడ్) అందజేశారు. ఈ ప్రోటీన్ ఫుడ్ ను బైపురెడ్డి రాంబాబు, చింతల్లి దంపతుల ఆర్థిక సహకారంతో అందించాలని మందిరం కన్వీనర్ రామకృష్ణ మాస్టారు తెలియజేశారు. సత్యసాయి బాబా భక్తులు రాంగోపాల్ మాట్లాడుతూ, సత్యసాయి సేవలు మరువలేవని, ఉచిత విద్య, వైద్యం తో పాటు తాగునీటి సౌకర్యాన్ని అందించారన్నారు.

అందిస్తున్న ఫుడ్ ప్యాకెట్

బకాయిలు చెల్లించాలని పెన్షనర్ల ధర్నా

రాజవొమ్మంగిలో ధర్నా చేస్తున్న పెన్షనర్లు

ప్రజాశక్తి-రాజవొమ్మంగి: తక్షణమే బకాయిలు చెల్లించాలంటూ సోమవారం రాజవొమ్మంగిలో పెన్షనర్లు ధర్నా నిర్వహించారు. అనంతరం స్థానిక పెన్షనర్ల కార్యాలయంలో పెన్షనర్స్ అధ్యక్షుడు కృష్ణ వర్మ అధ్యక్షతన సర్వసభ్య సమావేశంలో పెన్షనర్స్ సమస్యలపై చర్చించారు. ఈసందర్భంగా బకాయిలు వెంటనే చెల్లించాలని, పెండింగ్ డిఆర్‌లు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ తీర్మానించారు. 2025-26 సంవత్సరానికి సంఘ బడ్జెట్ ఆమోదించారు. కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్లు రాధాకృష్ణ, పోతురాజు, సూరిబాబు, మరిడి రాజు, రాజేశ్వరరావు, పెద్ద సంఖ్యలో పెన్షనర్లు పాల్గొన్నారు.

మరమ్మతుకు నోచని కుళాయి

మరమ్మతుకు నోచని కుళాయిలు

ప్రజాశక్తి-చింతపల్లి: మండలంలోని కొత్తపాలెం పంచాయితి రామ్‌నగర్ కాలనీలో పది రోజుల క్రితం వీధి కుళాయిలు మరమ్మత్తులకు గురయ్యాయి. దీంతో గ్రామంలో పది రోజులుగా నీటి సరఫరా పూర్తిగా స్తంభించిపోయింది. గ్రామంలో తాగు నీటి సమస్య పరిష్కరించాలని అధికారులను పలుమార్లు కోరినా స్పందించలేదని గ్రామస్థులు తెలిపారు. దీంతో గ్రామస్థులు తాగు నీటి కోసం మైళ్ల దూరం వెళ్ళవలసి వస్తుందని వారు వాపోయారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు స్పందించి మరమ్మత్తులకు గురైన వీధి కుళాయిల మరమ్మతు పనులు చేపట్టి తాగునీటి సరఫరా కల్పించాలని వారు కోరారు.

మాతృభాషా సంఘం జిల్లా అధ్యక్షునిగా జగన్

ప్రజాశక్తి-పాడేరు: అల్లూరి సీతారామరాజు జిల్లా మాతృభాష ఉపాధ్యాయ సంఘం నూతన జిల్లా అధ్యక్షుడిగా సీదరి.జగన్ నియమితులయ్యారు. ఈ మేరకు సోమవారం పాడేరులో జిల్లా కార్యవర్గంలో నూతన అధ్యక్షుడిని నియమించారు. ఇప్పటివరకు అల్లూరి జిల్లా అధ్యక్షుడిగా పనిచేసిన మర్రి.చిట్టిబాబు గత డిసెంబర్ నెలలో వైజాగ్ లో ఏర్పాటు చేసిన రాష్ట్ర కమిటీ లో రాష్ట్ర కార్యదర్శిగా నియమించపడటంతో అల్లూరి జిల్లా అధ్యక్ష పదవి కొత్తగా ఎన్నిక జరిపారు. ఈ జిల్లా కమిటీ సమావేశంలో పలు మండలాల నుంచి మాతృభాష ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దాతల సహకారంతో వాటర్ ప్లాంట్ ఏర్పాటు

ప్రజాశక్తి- మాడుగుల : మండలంలోని ఎం.కోడూరు గ్రామంలో మోదమాంబ అమ్మవారికి అదే గ్రామానికి చెందిన కీర్తిశేషులు ముమ్మిన సత్యారావు, మమత లక్ష్మి జ్ఞాపకార్థం కుమార్తె, అల్లుడు వాసవి వరప్రసాద్ దంపతులు, కుమారుడు ప్రవీణ్ కుమార్ సంధ్య దంపతులు ఆలయానికి వచ్చే భక్తులకు దాహార్తి తీర్చడానికి రూ.90 వేలతో మినీ మినరల్ వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు.సోమవారం ఆలయ కమిటీ చైర్మన్ గొల్లవిల్లి సంజీవిరావు ఆధ్వర్యంలో వాటర్ ప్లాంట్ ను ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు శ్రీనివాస్ శర్మ దంపతులు, ముమ్మిన రమణబాబు, పడాల అప్పలనాయుడు,అప్పాన నాయుడు, జొన్నపల్లి నాగరాజు, కలిమి శివ, కలిమి గోపాల్, తదితరులు పాల్గొన్నారు.

ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న సర్పంచ్, దాతలు

ప్రవీణ్ మృతిపై సమగ్ర విచారణ చేపట్టాలి

పలుచోట్ల క్రైస్తవుల శాంతి ర్యాలీ

అరకులోయలో శాంతి ర్యాలీ చేస్తున్న క్రిస్టియన్లు

ప్రజాశక్తి-అరకులోయ: పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతి సంఘటనపై సమగ్ర విచారణ జరిపి దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ అరకులోయ కేంద్రంలో సోమవారం యునైటెడ్ ఫాస్టర్స్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో సోమవారం శాంతి ర్యాలీ నిర్వహించారు. స్థానిక పెట్రోల్ బంక్ నుంచి శాంతి ర్యాలీ నిర్వహించి ఆర్టీసీ కాంప్లెక్స్ జంక్షన్ వద్ద మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు పాస్టర్స్ ఫెలోషిప్ ప్రతినిధులు మాట్లాడుతూ, పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతి చెంది ఐదు రోజులైనా ఇప్పటికీ దోషులు ఎవరో గుర్తించకపోవడం విచారకరమన్నారు. ప్రవీణ్ పగడాలహత్యకు గురయినట్లు భావిస్తున్నట్లు వారు అన్నారు. పథకం ప్రకారం క్రైస్తవులపై దాడులు చేసే వారిపై కఠినంగా శిక్షించి రక్షణ కల్పించాలని వారు డిమాండ్ చేశారు. ఈ శాంతి ర్యాలీలో ఆదివాసి గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పొద్దు బాలదేవ్ పాల్గొని తమ సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో సిబిఎం ఫీల్డ్ డైరెక్టర్ బిస్సప్ వేయిన్ జోసెఫ్, యునైటెడ్ ఫాస్ట్ ఫెలోషిప్ ప్రతినిధులు, సంజీవ్ కుమార్, పట్టాసి షద్రక్, బిషప్ డాక్టర్ విజయ్ డానియల్ మోడీ, ప్రసాద్ పాల్, జాన్ ప్రకాష్, కొర శెట్టి బాబురావు, సమూయేలు, బురిడీ ఆనంద్ రావు, ఒలేసి బాబురావు, మదన్, రాజేష్, రవి పాల్గొన్నారు.

పాడేరు టౌన్: పాస్టర్ ప్రవీణ్ పగడాల కేసును నిష్పక్షపాతంగా దర్యాప్తు చేయాలని, మతిపై అనుమానాలను నివత్తి చేసి క్రైస్తవులకు న్యాయం చేయాలని క్రైస్తవ నాయకులు ఆర్.జాన్, ఎం.బాబూరావు డిమాండ్ చేశారు. హైదరాబాదుకు చెందిన పాస్టర్ ప్రవీణ్ ఆత్మకు శాంతి కలగాలని పాడేరు పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్, యునైటెడ్ క్రిస్టియన్ యూత్ అసోసియేషన్ (యుసివైఎ) సంయుక్త ఆధ్వర్యంలో క్రైస్తవులు అల్లూరి జిల్లా కేంద్రం పాడేరులో ఆదివారం సంతాప శాంతి ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాల్లో పెను సంచలనం సష్టించిన పాస్టర్ అనుమానాస్పద మతి ఘటనపై నెలకొన్న పలు అనుమానాలపై ప్రభుత్వం స్పష్టత ఇచ్చి క్రైస్తవుల్లో మనోధైర్యాన్ని నెలకొల్పాలని కోరారు. పట్టణంలోని పిఎంఆర్ సి కూడలి నుంచి పాత బస్టాండ్ అంబేద్కర్ కూడలి మీదుగా సుంద్రుపుట్టు జంక్షన్ కు చేరుకుని, అక్కడ నుంచి తిరిగి పాత బస్టాండ్ అంబేద్కర్ కూడలి వరకు ర్యాలీ సాగింది. పాస్టర్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.సాల్మన్ రాజు, ఎం.డానియల్, బిషప్ దైవకప చిక్కాల, పాస్టర్స్ పి.ఫ్రెడ్రిక్, వైవై రత్నం, జి.తిమోతి, వి.మత్స్య రాజు, ఎస్.అబ్రహాం, పి.కృపావరం, జి.రామారావు, పి.డేవిడ్, యుసివైఎ ప్రతినిధులు బి.ఎలీషా, కె.భాస్కరరావు, కె.సత్యారావు, కె.సుజిత్, సైమన్, ఎం.స్టీవెన్ శ్రీనివాస్, డి.రవికుమార్, సంజీవ్, గ్లోరియస్, రాకేష్ పాల్గొన్నారు.

పాడేరులో క్రిస్టియన్ల శాంతి ప్రదర్శన

చింతపల్లి : పాస్టర్ ప్రవీణ్ కుమార్ మృతిపై పూర్తి విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని షారోమ్ టీమ్ మత బోధకుడు డేవిడ్ రాజు డిమాండ్ చేశారు. సోమవారం షారోమ్ టీమ్ ఆధ్వర్యంలో హనుమాన్ జంక్షన్ కూడలి నుండి సంత బయలు వీధి వరకు భారీ శాంతి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డేవిడ్ రాజు మాట్లాడుతూ,ఆయన మృతికి కారకులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ దురియా పుష్పలత, షారోమ్ టీమ్ సభ్యులు ఎస్.వనరాజు, ఆర్.సత్యనారాయణ (అర్జున్) తదితరులు పాల్గొన్నారు.

చింతూరు. : పాస్టర్ ప్రవీణ్ పగడాల హత్యపై పూర్తిస్థాయి దర్యాప్తు నిర్వహించాలని క్రైస్తవులపై దాడులను నిలవరించాలని పలువురు పాస్టర్లు డిమాండ్ చేశ్రారు. రత్నాపురం నుంచి చింతూరు వరకు ర్యాలీ చేపట్టి చింతూరులో మానవహారం నిర్వహించారు. . ఈ సందర్భంగా డివిజన్‌లోని పలువుల పాస్టర్లు మాట్లాడుతూ ప్రవీణ్‌ది హత్యా? లేకుంటే ప్రమాదమా నిర్ధారించాలని డిమాండ్ చేశారు. క్రైస్తవులపై దాడులను నిలువరింప చేయాలని కోరారు.కార్యక్రమంలో చింతూరు, వర రామచంద్రపురం, కూనవరం, ఎటపాక మండలాల పాస్టర్ల సంఘాలు పాల్గొన్నాయి.

మారేడుమిల్లి : పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతికి సంతాపంగా మారేడుమిల్లి మండల పాస్టర్స్ ఫెలోషిఫ్ ఆధ్వర్యంలో శాంతి ర్యాలీ నిర్వహించారు. మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించి, కూడలిలో మానవహారంగా ఏర్పడి నివాళలర్పించారు. పాస్టర్ కుటుంబానికి ఓదార్పు కలగజేయాలని కోరుతూ ప్రత్యేక ప్రార్ధనలు చేశారు.

ఈ సందర్భంగా పాస్టర్స్ ఫెలోషిఫ్ అధ్యక్షుడు సి.శామ్యూల్ మాట్లాడుతూ ప్రవీణ్ అకాల మరణం క్రైస్తవ లోకాన్ని కలిసి వేసిందని, ఆయన సేవలు ఎనలేనివని కొనియాడారు.ఒక మంచి క్రైస్తవ బోధకుడిని కోల్పోయామని విచారం వ్యక్తంచేశారు. ప్రవీణ్ మృతితో హైదరాబాద్ ఎందరో అనాథ పిల్లలు దిక్కులేని వారిగా మారారన్నారు. కార్యక్రమంలో మారేడుమిల్లి మండల పాస్టర్స్ ఫెలోషిప్ గౌరవాధ్యక్షుడు బి ప్రభాకరరావు, బిషప్ గొర్లె శ్రీకాంత్, కె.జాకోబ్, జాన్‌రత్న ప్రకాష్‌రెడ్డి, ఎల్.రవికుమార్, సిఎస్ఐ పాస్టర్స్ చైర్మన్ చిన్నం సుభాకర్, పలువురు పాస్టర్లు, క్రైస్తవ పెద్దలు క్రైస్తవులు పాల్గొన్నారు.

చింతూరు ఐటిడిఎ వద్ద పాస్టర్లు, క్రిస్టియన్ల శాంతి ర్యాలీ

తారురోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే శిరీషాదేవి

ప్రజాశక్తి-అడ్డతీగల :మండలంలోని డి.రామవరం నుంచి వీరంపాలెం గ్రామం వరకు రూ.2.47కోట్లతో 3.20 కిలోమీటర్ల తారురోడ్డు పనులకు స్థానిక ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రం ప్రగతిపథంలో నడవాలన్నా, ప్రతి పల్లె పురోభివృద్ధి సాధించాలన్నా అది ముఖ్యమంత్రి చంద్రబాబుతోనే సాధ్యమని అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కొద్ది కాలంలోనే అభివృద్ధి, సంక్షేమంలో రాష్ట్రం ముందుకు సాగుతోందన్నారు. మున్ముందు రంపచోడవరం నియోజకవర్గంలో మరిన్ని అభివద్ధి పనులు చేపడతామన్నారు. ఈ మేరకు ప్రభుత్వానికి అంచనా ప్రతిపాదనలు వెళ్లాయని,. అనుమతులు రాగానే పనులు చేపడతామన్నారు. ఈ సందర్భంగా డి రామవరం గ్రామంలో పార్టీ కార్యకర్తలు వెంకటరమణ, ఎస్ నాగమణి కుటుంబాలను ఎమ్మెల్యే దంపతులు పరామర్శించారు. కార్యక్రమంలో తెలుగు యువత నియోజకవర్గ అధ్యక్షులు మఠం విజయభాస్కర్, పార్టీ మండల అధ్యక్షులు జర్తా వెంకటరమణారెడ్డి, బిజెపి జిల్లా కార్యదర్శి స్వప్నకుమారి,మండల అధ్యక్షుడు రాజబాబు, బాలయోగి, జనసేన నేతలు రాజేంద్ర, స్థానిక సర్పంచ్, కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

రైతుసంక్షేమానికి పెద్దపీట

రాజవొమ్మంగి: రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయంగా ముఖ్యమంత్రి చంద్రబాబు ముందుకు వెళ్తున్నారని రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి అన్నారు. రూ.10 లక్షలతో మండలంలోని ఒట్టిగడ్డ రిజర్వాయర్ కాలువలో పూడికతీత పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ. గత వైసిపి ప్రభుత్వం నిర్లక్ష్యంతో రైతులు సాగునీటికి నానా ఇబ్బందులు పడ్డారని, సాగునీటి చెరువులు, రిజర్వాయర్లు, చెక్ డ్యాముల నిర్వహణ గాలికొదిలేసిందన్నారు. అనంతరం రూ.ఐదు లక్షలతో దూసరపాము ఎంపిపి పాఠశాల ఆటస్థలం అభివృద్ధి పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో రంపచోడవరం తెలుగు యువత నియోజకవర్గ అధ్యక్షులు మఠం విజయభాస్కర్, తెలుగుదేశం మండల అధ్యక్షులు గొల్లపూడి పెద్దిరాజు, రాజవొమ్మంగి, దూసరపాము సర్పంచ్‌జి రమణి,చిడి శివ, మార్కెట్ కమిటీ చైర్మన్ లోతా లక్ష్మణరావు, రాజవొమ్మంగి సిఐ ఎన్ సన్యాసినాయుడు, ఎస్ఐ నరసింహమూర్తి, టిడిపి మండల కార్యదర్శి ఎం డింబకేశ్వరరావు, నేతలు సావిత్రి, మోహన్, మధు, పి సత్తిబాబు పాల్గొన్నారు.

సరుకుల పంపిణీ

ప్రజాశక్తి-నక్కపల్లి:రంజాన్ పర్వదినాన్ని పురస్కరించు కొని నక్కపల్లి లో టిడిపి కార్యాలయంలో సోమవారం తెలుగుదేశం పార్టీ మండల శాఖ అధ్యక్షులు కొప్పిశెట్టి వెంకటేష్ ముస్లీం సోదరులకు రంజాన్ తోఫా సరుకులను అందజేశారు. ముస్లీం సోదరులకు ముందుగా శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో న్యాయంపూడి సర్పంచ్ రెడ్డి వరహాల బాబు తదితరులు పాల్గొన్నారు.

ఉపమాక రామాలయంలో సప్తాహం

ప్రజాశక్తి-నక్కపల్లి:మండలంలోని ఉపమాక మెరక వీధి కోదండ రామాలయంలో శ్రీనివాసా భజన భక్త సమాజం ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం సప్తాహం (భజన) కార్యక్రమం ప్రారంభించారు. ఈనెల 6న ఆదివారం శ్రీరామనవమి పురస్కరించుకుని సీతారాముల కళ్యాణ మహోత్సవం సందర్భంగా 7 రోజుల పాటు భజన కార్యక్రమం చేపట్టినందుకు శ్రీకారం చుట్టారు. దీనిలో భాగంగా గ్రామ తిరు వీధిలో శోభాయాత్ర నిర్వహించి భజన కార్యక్రమాన్ని ప్రారంభించారు. 30 న ఉదయం ప్రారంభమైన భజన ఈనెల 6వ తేదీ ఉదయం 6 గంటల వరకు కొనసాగుతుందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. 6న కోదండ రామాలయంలో సీతారాముల కల్యాణం వైభవంగా నిర్వహించడానికి ఏర్పాట్లు పూర్తి చేస్తున్నామని తెలిపారు. అన్న సమారాధన, ఉత్సవమూర్తుల ఊరేగింపు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు వెల్లడించారు.

కార్మికుల ఆరోగ్యాన్ని వ్యాపారంగా మార్చే కుట్ర

ప్రజాశక్తి-సీతమ్మధార : కార్మికుల ఆరోగ్యాన్ని వ్యాపారంగా మార్చే కుట్రను తాము అంగీకరించబోమని యునైటెడ్ పోర్టు అండ్ డాక్ వర్కర్స్ యూనియన్ జనరల్ సెక్రటరీ కె.సత్యన్నారాయణ స్పష్టంచేశారు. పోర్టు హాస్పిటల్‌ను ప్రయివేటీకరించేందుకు కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ యునైటెడ్ పోర్టు అండ్ డాక్ వర్కర్స్ యూనియన్, విడిఎల్‌బి అండ్ డాక్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యాన పోర్టు హాస్పిటల్ వద్ద చేపట్టిన దీక్ష సోమవారమూ కొనసాగింది. ఈ దీక్షలో కార్మికులు, ఉద్యోగులు, పెన్షనర్లు, కుటుంబ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొని, పబ్లిక్ ప్రయివేటు పార్టనర్‌షిప్ ద్వారా హాస్పిటల్‌ను ప్రయివేటు చేతికి అప్పగించే కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని ఖండించారు. ఈ సందర్భంగా కె.సత్యనారాయణ మాట్లాడుతూ, పోర్టు హాస్పిటల్ ప్రయివేటీకరణ వల్ల ఉద్యోగులు, కార్మికులు, పెన్షనర్లు, కుటుంబ సభ్యులు తగినంత వైద్యం పొందలేరని తెలిపారు. ప్రయివేటీకరణ నిర్ణయాన్ని ప్రభుత్వం తక్షణమే వెనక్కి తీసుకోవాలని డిమాండ్‌చేశారు. లేకుంటే పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. రీటెండర్ ప్రక్రియను వెంటనే నిలిపివేయాలని కోరారు. పోర్టు యాజమాన్యం సొంత నిధులతోనే హాస్పిటల్‌ను అభివృద్ధి చేయాలని, నిపుణులైన డాక్టర్లు, సిబ్బందిని నియమించాలని, అధునాతన వైద్య పరికరాలను ఉంచాలని డిమాండ్‌చేశారు.

ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తూ అన్ని కార్మిక సంఘాలను కలుపుకొని ఐక్యంగా ఉద్యమం చేస్తామన్నారు. ఈ నెల 1వ తేదీ నుంచి ఉద్యోగుల నివాస ప్రాంతాల్లో నిరసనలు, ఈ నెల 9వ తేదీ ఉదయం 9 గంటలకు 'చలో ఎఒబి' నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ ఉద్యమాన్ని మరింత ఉధృతమయ్యేందుకు కార్మికులంతా ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కెఎస్.కుమార్, జిసిహెచ్.నాయుడు, బి.జగన్, శంకర్, అమిరింద్ర, సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

2న 'ఆదర్శ్'లో జాబ్ మేళా

ప్రజాశక్తి-పెందుర్తి : పెందుర్తిలోని ఆదర్శ్ డిగ్రీ కళాశాలలో ఈ నెల 2వ తేదీన హాని గ్రూప్ కంపెనీలో ఉద్యోగం కోసం జాబ్ మేళా నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ ఎన్ఇ ఫ్లోరా తెలిపారు. 2వ తేదీ ఉదయం 9:30 గంటలకు మేళా ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. హాని గ్రూప్ కంపెనీలో బిజినెస్ డెవలప్‌మెంట్, రిలేషన్‌షిప్ మేనేజర్ ఉద్యోగాలు కోసం ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు తెలిపారు. సంవత్సరానికి జీతం రూ.2 లక్షల నుంచి రూ.3.5 లక్షల వరకు ఉంటుందని వివరించారు. ఈ ఉద్యోగాల కోసం 2022 నుంచి 2025 వరకు డిగ్రీ పూర్తిచేసిన, డిగ్రీ చివరి సెమిస్టర్ చదువుతున్న విద్యార్థులు, నిరుద్యోగులు, ఇతర కళాశాలల విద్యార్థులు పాల్గొనవచ్చని తెలిపారు. రెండు పాస్‌పోర్ట్ ఫొటోలు, ఎస్-ఎస్‌సి సర్టిఫికెట్, డిగ్రీ సర్టిఫికెట్ లేదా 5వ సెమిస్టర్ మార్క్స్ లిస్ట్ తీసుకుని ఆదర్శ్ కళాశాల డీజీ సెమినార్ హాల్‌కు హాజరు కావాలని కళాశాల సెక్రటరీ టి.థియోఫిలాస్ వివరించారు. ఈ అవకాశాన్ని యువత వినియోగించుకోవాలని కోరారు.

ఘనంగా రంజాన్ వేడుకలు

చింతపల్లిలో ప్రార్థనలు చేస్తున్న ముస్లిములు

ప్రజాశక్తి -యంత్రాంగం

హుకుంపేట: మండల కేంద్రంలోని ముస్లిం సోదరులు రంజన్ దినోత్సవం పురస్కరించుకొని భక్తిశ్రద్ధలతో రంజని వేడుకలు ఘనంగా సోమవారం నిర్వహించారు. ముస్లిం సోదరులందరూ భక్తిశ్రద్ధలతో పాల్గొని నమాజ్ చేసుకుంటూ అల్లాదిని ప్రార్థన చేశారు. కుటుంబం దేశం శాంతి సమాధానం తో చల్లగుండాలని అల్లాదును వేడుకున్నారు. ఎటువంటి అవాంఛన సంఘటనలు చూసుకుంటా పోలీస్ శాఖ వారు కూడా రంజాన్ వేడుకల్లో పాల్గొని భద్రత కల్పించారు.

జిమాడుగుల మండల కేంద్రంలో గల స్థానిక మసీదు వద్ద రంజాన్ వేడుకలు ఘనంగా నిర్వహించారు భక్తిశ్రద్ధలతో ముస్లిం సోదరులు అందరూ నమాజ్ చేస్తూ ప్రార్థనలు నిర్వహించారు, రంజాన్ పర్వదినాన పలువురు ముస్లిం సోదరులు ఇఫ్తార్ విందు భోజనాన్ని పలువురికి ఏర్పాటు చేశారు.

చింతపల్లి: రంజాన్ " పర్వదిన వేడుకలు చింతపల్లి లో సోమవారం ఘనంగా జరిగాయి. స్థానిక మజీద్ ఏ క్యూబా లో ఈద్-ఉల్-ఫితర్ రంజాన్ పర్వదిన ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ముస్లింలు ఒకరి కొకరు ఆలింగనం చేసుకొని, రంజాన్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ కార్యక్రమంలో మజీద్ కమిటీ అధ్యకులు షేక్ మీరా సాహెబ్, మండల కో ఆప్షన్ సభ్యుడు నాజర్ వల్లి, సభ్యులు షేక్ ఖాసింవలీ, నూర్ సాహెబ్, షేక్ సత్తార్, వల్లి, అధిక సంఖ్యలో ముస్లింలు పాల్గొన్నారు..

కూనవరం :మండల కేంద్రంలోని మసీదులో రంజాన్ వేడుకల్లో సిపిఎం నేతల బృందం పాల్గొని, ముస్లిములకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. సోమవారం సిపిఎం మండల కార్యదర్శి బాబు బొర్రయ్య, జిల్లా కమిటీ సభ్యులు పాయం సీతారామయ్య, సీనియర్ నాయకులు తలగాని నాగరాజు,తాలూరి శ్రీనివాసరావు, మడెం బాబు, కొండా ఈశ్వర్ తదితరులు మసీదుకు వెళ్లి ముస్లిములతోపాటు రంజాన్ వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిపిఎం నేతలు మాట్లాడుతూ, హిందువులు, క్రైస్తవులు ముస్లింలు అందరూ సమానమేనన్న భావనతో కలిసిమెలిసి ఉండాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా సిపిఎం నేతల బృందంతోపాటు అందరికీ సేమియా అందించిన ముస్లిములు, వేడుకలకు స్వాగతించారు.

సీలేరు: సీలేరులో మహమ్మదీయులు నెలరోజులపాటు చేపట్టిన రంజాన్ ఉపవాస దీక్షలు సోమవారంతో ముగించారు. సోమవారం రాత్రి నెలవంక కనిపించడంతో మహమ్మదీయులు ఆచారం ప్రకారం మతపెద్దలు ఆదేశాలతో ఉపవాస దీక్షలు ముగించారు. ముందుగా స్థానిక మసీదులో మహమ్మదీయులు నమాజ్, ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం మసీదు నుంచి ర్యాలీగా నినాదాలు చేస్తూ శ్మశానవాటికకు చేరుకుని, మృతుల ఆత్మకు శాంతి చేకూరాలని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. రంజాన్ పర్వదినం సందర్భంగా మహమ్మదీయులు పరస్పరం శుభాకాంక్షలు తెలిపారు.

ర్యాలీగా వెళుతున్న మహమ్మదీయులు

పట్టాలు పునరుద్ధరించాలని గిరిజన రైతుల నిరసన

ప్రజాశక్తి- రావికమతం:మండలంలో కవగుంట గ్రామ పంచాయతీలో మూడేళ్ల క్రితం జరిగిన రీ సర్వేలో రద్దు పరచిన పట్టాలను తక్షణమే పునరుద్ధరించాలని గ్రామానికి చెందిన బాధిత గిరిజన రైతులు గ్రామంలో సోమవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా గిరిజన రైతులు సమాల కళ్యాణం, బీరా దేవుడమ్మ, ఉరికిటి బంగారమ్మ, నమ్మి రామనాయుడు, దేవర మారమ్మ, నమ్మి రాము, రోబ్బా నాగరాజు, బీరా పరుశురాము, రబ్బా పార్వతమ్మ, రబ్బా దేవుళ్ళు, సిద్ధ పట్టాల నాయుడు, సిద్ధ లక్ష్మి, సిద్ధ ఈశ్వరరావు, చింతాడ ముసలి డోర, బర్నికాన అప్పలకొండ, దాసరి అచ్చియమ్మ మాట్లాడుతూ, కవగుంట గ్రామంలో కొంతమంది రైతులకు 16 ఏళ్ల క్రితం తాము సాగు చేసుకుంటున్న బంజరు భూములకు డిపట్టా, పాస్ పుస్తకం ఆన్లైన్ చేసి ప్రభుత్వం రైతులకు అందించిందన్నారు. గత మూడేళ్ల క్రితం గ్రామంలో జరిగిన రిసర్వే లో రెవెన్యూ అధికారులు, సర్వే యంత్రాంగం పలు అవకతవకులకు పాల్పడ్డార్నారు. ఈ విషయంపై ఉన్నత స్థాయి అధికారులు తప్పుకొని గ్రామస్థాయి వీఆర్వో వంటి చిన్న స్థాయి అధికారిని బలి పశువును చేసి సస్పెండ్ చేశారన్నారు. ఈ విషయమై సమగ్రమైన విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వీటి పైన పలుమార్లు రెవిన్యూ సదస్సులు, జిల్లా కలెక్టర్కు, నర్సీపట్నం ఆర్డిఓ కు పలుమార్లు ఫిర్యాదులు చేసినప్పటికీ అధికారుల నుంచి ఎటువంటి స్పందన లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వాస్తవ పరిస్థితులు క్షేత్రస్థాయిలో కనిపిస్తున్నప్పటికీ కనీసం స్పందన లేదన్నారు. పైసలకు కక్కుర్తి పడి అధికారులు రియల్ ఎస్టేట్ వ్యాపారికి ఆన్లైన్, పాస్ పుస్తకాలు, మంజూరు చేయడం చాలా విడ్డూరంగా ఉందన్నారు. కవగుంట గ్రామంలో 50 సంవత్సరాల క్రితం డి పట్టా, ఆన్లైన్ ఇచ్చిన రైతు భూమిని వేరొకరికి ఆన్లైన్, పాస్బుక్ ఇవ్వడం ఎంతవరకు సబబని ప్రశ్నించారు.

రైతుల పక్షాన పోరాటం: సిపిఎం

ఈ విషయమై అనకాపల్లి జిల్లా సిపిఎం జిల్లా ప్రధాన కార్యదర్శి డి వెంకన్న పత్రిక ప్రకటన విడుదల చేశారు. గ్రామంలో ఎవరికైతే పట్టాలు రద్దు చేశారో వారందరికీ తక్షణమే పట్టాలు పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. గతంలో ప్రభుత్వం ఇచ్చిన భూమి ఆన్లైన్లో నుంచి తొలగించి వేరొకరికి ఇచ్చిన వాటిని తక్షణమే సరి చేయాలన్నారు. ఎటువంటి ఆధారాలు లేకపోయినా వారి పేరున ఆన్లైన్, పాస్ పుస్తకాలు ఇచ్చిన వారిపైన తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో చలో అమరావతి కార్యక్రమం రైతులతో కలిసి చేపట్టక తప్పదని ఆయన హెచ్చరించారు. రెవెన్యూ యంత్రాంగం ఎందుకు తాత్సారం చేస్తున్నారో బయట పెట్టాలన్నారు. లేని పక్షంలో రైతుల పక్షాన పోరాటానికి సిద్ధమని ఆయన డిమాండ్ చేశారు.

నేరాలు ఘోరాలు

రావికమతంలో చోరీ

ప్రజాశక్తి-రావికమతం:మండల కేంద్రంలో దుండ గులు చోరీకి పాలడ్డారు. గర్నికం సినిమా థియేటర్ ఎదురుగా బి.ఎన్ రోడ్డును ఆనుకొని ఉన్న ట్రాక్టర్ మెకానిక్ షెడ్‌లో ఉంచిన ట్రాక్టర్ ఇంజన్ వెనుక భాగంలో ఉన్న విడి భాగాలను ఆదివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు అపహరించారు. ఆదివారం రాత్రి జరిగిన చోరీపై పోలీసులకు ఫిర్యాదు చేయడం జరిగిందని ట్రాక్టర్ షాపు యజమాని రామచంద్రరావు తెలిపారు. ఇప్పటికైనా పోలీసులు గస్తీ ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.

తండ్రిని హత్యచేసిన కుమారునికి రిమాండ్

ప్రజాశక్తి - ఆరిలోవ : తండ్రిని హత్యచేసిన కుమారున్ని ఆరిలోవ పోలీసులు రిమాండ్‌కు పంపించారు. ఆరిలోవ సిఐ కథనం ప్రకారం... పి.అప్పారావు రైల్వేలో పనిచేసి రిటైర్డ్ అయ్యారు. భార్య, కుమారుడుతో కలిసి ఆరిలోవ డ్రైవర్స్ కాలనీలో నివాసముంటున్నారు. కుమారుడు బాలయోగి (42) దురలవాట్లకు బానిసై ఏపని చేయకపోవడంతో తండ్రి అప్పారావు మందలించేవారు. శుక్రవారం అర్ధరాత్రి పూటుగా తాగి వచ్చిన కుమారుడు బాలయోగిని తండ్రి అప్పారావు మందలించే క్రమంలో చేయి చేసుకున్నాడు. దీనితో ఆగ్రహించిన కుమారుడు బాలయోగి బ్లేడుతో తండ్రిపై దాడికి దిగాడు. బ్లేడు ఛాతి భాగంలో లోతుగా తెగడంతో అప్పారావుకు తీవ్ర రక్త స్రావం అయ్యింది. స్థానికులు కెజిహెచ్‌కు తరలించారు. చికిత్స పొందుతూ శనివారం సాయంత్రం అప్పారావు మృతి చెందినట్టు సిఐ మల్లేశ్వర్రావు తెలిపారు. కేసు నమోదు చేసి బాలయోగిని అదుపులోకి తీసుకొని ఆదివారం రిమాండ్‌కు తరలించారు.

గీతం ప్రొఫెసర్‌కు ఉగాది పురస్కారం

ప్రజాశక్తి-మధురవాడ : గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ హ్యుమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్ ఫ్యాకల్టీ సభ్యులు డాక్టర్ మాల్యాద ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నుండి ప్రతిష్టాత్మకమైన ఉగాది పురస్కారం అందుకున్నారు. ఉగాది సందర్భంగా అమరావతిలోని పురస్కార వేడుకలో డాక్టర్ మాల్యాదకు ముఖ్యమంత్రి చంద్రబాబు అందజేశారు. భారతీయ సాంస్కృతిక కళల్లో, ముఖ్యంగా కూచిపూడి నృత్య రంగంలో డాక్టర్ మాల్యాద అత్యుత్తమ కృషికి ఈ గుర్తింపు లభించింది. స్వతాహగా కూచిపూడి నృత్యకళాకారిణి ఐన డాక్టర్ మాల్యద శాస్త్రీయ నృత్య రీతులపై పరిశోధనలకు అన్నామలై విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్‌ను అందుకున్నారు, రేవా విశ్వవిద్యాలయం నుంచి భారతీయ సంస్కృతిపై ముఖ్యంగా పురాణాలు, దేవాలయ శిలాశాసనాలు, క్లాసికల్ గ్రంథాల ఆధారితంగా జరిపిన పరిశోధనలకు డాక్టరేట్ అందుకున్నారు. దాదాపు 15 కంటే ఎక్కువ ప్రచురణలను, 20 కంటే ఎక్కువ జాతీయ, అంతర్జాతీయ సదస్సుల్లో పరిశోధనా పత్రాలను డాక్టర్ మాల్యద సమర్పించారు. డాక్టర్ మాల్యద రచించిన శాస్త్రీయ పరిశోధన పత్రాలు అనేక పీర్-రివ్యూ, యూజీసీ-కేర్ జర్నల్స్‌లో ప్రచురితమయ్యాయి. భారతీయ శాస్త్రీయ కళలపై విస్తృతమైన అధ్యయనం, సాహిత్యాన్ని వీటిలో వివరించారు. డాక్టర్ మాల్యాదకు గీతం అధికారులు అభినందనలు తెలిపారు.

గీతం ప్రచార చిత్రం ఆవిష్కరణ

ప్రజాశక్తి-మధురవాడ : గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం విశాఖపట్నం, హైదరాబాద్, బెంగళూరు ప్రాంగణాలలో అందిస్తున్న కోర్సులు, గీతం లక్ష్యాలు, అధునాతన ప్రయోగశాలలు తదితర అంశాలతో రూపొందించిన ప్రచార చిత్రాన్ని గీతం ప్రో వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ వై.గౌతమరావు సోమవారం ఆవిష్కరించారు. విద్యార్థుల భవిష్యత్తును ఉన్నతంగా తీర్చిదిద్దేవిధంగా ప్రత్యేక విజన్‌తో గీతం ముందుకు వెళుతోందని ఆయన పేర్కొన్నారు. గీతంలో విద్యాభ్యాసం పూర్తి చేసుకుని ఐపిఎస్, ఐఎఎస్ వంటి ఉన్నత స్థానాలకు ఎదిగిన వారి వివరాలతో పాటు, సాధారణ కుటుంబం నుంచి వచ్చి గీతం ద్వారా అమెరికా వంటి దేశాలలో స్టార్టప్‌లను ఏర్పాటు చేసుకున్న వారి స్ఫూర్తి దాయకమైన వివరాలను ప్రచార చిత్రంలో చూపించడం ఎందరికో మార్గదర్శకం కాగలదన్నారు. గీతం విశేషాలను ప్రజలకు చేరువ చేయుడానికి ఈ చిత్రం దోహదపడుతుందని తెలిపారు. కార్యక్రమంలో గీతం అడ్మిషన్ల విభాగం అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. పాఠశాలల విద్యార్థులలో స్ఫూర్తి నింపడానికి దేశ వ్యాప్తంగా ఎంపిక చేసిన పాఠశాలలో చిత్రాన్ని ప్రదర్శించనున్నారు.

వినూత్నరీతిలో నిరసన తెలుపుతున్న సిపిఎం నాయకులు

తల్లికి వందనం ఎక్కడ ? 96 గజాల స్థలం ఏదీ?

- సిపిఎం వినూత్న నిరసన

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : కూటమి ప్రభుత్వమిచ్చిన హామీలను అమలు చేయకపోవడంపై సిపిఎం జగదాంబ జోన్ కమిటీ వినూత్న నిరసనకు దిగింది. ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని జోన్ కమిటీ కన్వీనర్ ఎం.సుబ్బారావు ఆధ్వర్యంలో జగదాంబ జంక్షన్‌లో ఈ కార్యక్రమం చేపట్టారు. 'తల్లికి వందనం ఎక్కడ ? 96 గజాల స్థలం ఏదీ ? మహిళలకు ఇవ్వాల్సిన రూ.15 వేలు ఎవరి ఖాతాలో పడ్డాయి ?గ్యాస్ సిలిండర్ల డబ్బులు ఎంత మందికి వచ్చాయి ? మహిళలకు ఉచిత బస్సు తుస్సేనా ? కరెంటు ఛార్జీలు పెంచబోమని ఇప్పుడేం చేశారు ? స్మార్ట్ మీటర్ల పరిస్థితి ఏంటి ? అన్న ప్రశ్నలను కూటమి ప్రభుత్వంపై సంధిస్తూ సిపిఎం సీనియర్ నాయకులు వై.రాజు రూపొందించిన కళాఖండాలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పి.మణి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం కల్లబొల్లి మాటలతో అధికారంలోకి వచ్చిందని మండిపడ్డారు. సూపర్ సిక్స్ నెరువేరుస్తామని, విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేటీకరణ చేయబోమని, సొంత గనులు ఇప్పించే బాధ్యత తీసుకుంటామని చెప్పి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం స్టీల్ ప్లాంట్ సొంత గనుల కోసం మాట్లాడకపోవడం సిగ్గు చేటన్నారు. మత్స్యకారులు, మత్స్యకార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు కర్రి చంద్రశేఖర్ మాట్లాడుతూ మత్స్యకారుల వేట నిషేధ కాలంలో ఇచ్చే భృతిని రూ.20 వేలకు పెంచి నేటికీ ఇవ్వకపోవడం దారుణమన్నారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ నాయకులు కె.సంతోష్ కుమార్, గణేష్ కుమార్, సంజయ్, సిఐటియు నాయకులు చంద్రమౌళి, ,భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు కె.నర్సింగరావు, సిమ్మనాయుడు, రామకృష్ణారావు, ఎం.సూరీడు పాల్గొన్నారు.

రూ.510 కోట్ల ఆస్తి పన్ను వసూలు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : జివిఎంసి పరిధిలో 2024-25 ఆర్థిక సంవత్సరంలో రూ.510 కోట్ల ఆస్తి పన్నును వసూలు చేసినట్టు జిల్లా కలెక్టర్, జివిఎంసి ఇన్‌ఛార్జి కమిషనర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2023-24 ఆర్థిక సంవతరంలో ఆస్తి పన్ను రూ.454 కోట్లు వసూలు కాగా ఈసారి దాన్ని అధిగమించినట్టు పేర్కొన్నారు. క్షేత్ర స్థాయిలో అందరూ పన్నుల వసూళ్లకు కృషి చేయడం వల్లే ఇది సాధ్యమైందని తెలిపారు.

బైకుల దగ్ధం కేసులో మహిళ అరెస్టు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : సింగ్ హోటల్ జంక్షన్ సమీపంలోని విశ్వనాథ కాలనీలో గ్రూప్ హౌస్ సెల్లార్‌లో శనివారం తెల్లవారుజామున జరిగిన అగ్ని ప్రమాదంలో 17 మోటార్ బైకులు పూర్తిగా దగ్ధమయ్యాయని, రూ.19 లక్షల మేర ఆస్తి నష్టం జరిగిందని, ఈ కేసులో ఓ మహిళను అరెస్టు చేశామని ఈస్ట్ సబ్ డివిజన్ ఎసిపి లక్ష్మణమూర్తి మీడియాకు తెలిపారు. సోమవారం టూ టౌన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ జివిఎంసిలో పనిచేస్తున్న భరత్ అనే వ్యక్తి ఓ మహిళను నమ్మించి మోసగించాడని తెలిపారు. ఇటీవల భరత్ నూతన ద్విచక్ర వాహనాన్ని కొనుగోలు చేశాడన్న విషయం తెలియడంతో ఆయనపై కోపంతో ఉన్న మహిళ సెల్లార్‌లో ఉన్న అతని బైక్‌కు నిప్పు పెట్టిందన్నారు. ఆ ప్రమాద తీవ్రత పెరిగి మిగిలిన వాహనాలూ దగ్ధమయ్యాయన్నారు. ఘటనకు బాధ్యురాలైన మహిళను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. సమావేశంలో టూ టౌన్ సిఐ వివిసిఎం.ఎర్రంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

పట్టని బాధితుల గోస

రోడ్డు విస్తరణ పనుల శిలాఫలకం వద్ద మంత్రి నారా లోకేష్

- అచ్యుతాపురం - అనకాపల్లి రోడ్డు విస్తరణపై సర్వత్రా ఆందోళన

- పరిహారం తేల్చకుండానే మంత్రి లోకేష్ శంకుస్థాపన

- నగదు బదులు టిడిఆర్ బాండ్లు జారీ

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి/మునగపాక, అచ్యుతాపురం విలేకరులు

అచ్యుతాపురం - అనకాపల్లి రోడ్డు విస్తరణలో భూములు, స్థలాలు, ఇళ్లు కోల్పోయే వారికి పరిహారం చెల్లింపుపై స్పష్టత ఇవ్వకుండానే, వారి ఆమోదం తీసుకోకుండానే రోడ్డు విస్తరణ పనులకు రాష్ట్ర విద్య, ఐటి శాఖ మంత్రి నారా లోకేష్ సోమవారం శంకుస్థాపన చేశారు. ఆర్అండ్‌బికి చెందిన ఈ రహదారి విస్తరణలో ఆస్తులు పోయిన వారికి నగదు బదులు ట్రాన్స్‌ఫరబుల్ డెవలప్‌మెంట్ రైట్స్ (టిడిఆర్) బాండ్లను ఇచ్చి చేతులుదులుపుకొనేందుకు ప్రభుత్వం విఎంఆర్‌డిఎను రంగంలోకి దించింది. ఆ సంస్థ టిడిఆర్‌లు తప్ప నగదు ఇవ్వదని ప్రచారం చేయడంతో బాధితులు ఆందోళన చెందుతున్నారు. 2013 భూ సేకరణ చట్టం ప్రకారం పరిహారం చెల్లించే వరకు తమ భూములు, స్థలాలు, ఇళు విడిచిపెట్టేది లేదని చెబుతున్నప్పటికీ, వారిని భయపెట్టి అంగీకరింపజేసే పని కూటమి నాయకులు చేస్తున్నారు.

తమకు నగదు రూపంలో పరిహారం చెల్లించాలని యలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్ దృష్టికి బాధితులు తీసుకెళ్లారు. నగదు చెల్లింపుపై హామీ ఇవ్వకుండా రోడ్డు విస్తరణ పనులకు శంకుస్థాపన చేయించడంతో బాధితులు ఆయనపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. భూ సేకరణ భారం ప్రభుత్వంపై లేకుండా టిడిఆర్ బాండ్లతో రోడ్డు విస్తరణ చేపట్టాలన్న ప్రభుత్వ వ్యూహాన్ని బాధితులకు చెప్పకుండా ఎమ్మెల్యే విజయ్‌కుమార్ దాచిపెడుతున్నారు. అందుకు విఎంఆర్‌డిఎను అడ్డంపెట్టి బాధితుల చేతుల్లో బాండ్లు పెట్టించి తప్పుకోవాలని చూస్తున్నారు. 2013 భూ సేకరణ చట్టం ప్రకారం పరిహారాన్ని నగదు కింద చెల్లిస్తేనే తమకు న్యాయం జరుగుతుందని బాధితులు అంటున్నారు. అయితే వారి న్యాయమైన డిమాండ్‌ను సిపిఎం తప్ప ఎవరూ వినిపించుకున్నట్లు లేదు. అటు అనకాపల్లి ఎంపీ సిఎం రమేష్, యలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్‌గానీ, ఇటు ప్రభుత్వాధికారులుగానీ ఎవరూ తమ గోడు వినిపించుకోవడంలేదని బాధితులు వాపోతున్నారు. ప్రస్తుతమున్న రోడ్డును వంద అడుగులకు విస్తరించాలన్న ఆలోచనలో ఆర్అండ్‌బి అధికారులుండగా, 150 అడుగులకు రోడ్డును విస్తరించాలని విఎంఆర్‌డిఎ మాస్టర్ ప్లాన్‌లో వుందని ఎమ్మెల్యే చెబుతున్నారు. పరిహారం నుంచి విస్తరణ వరకు స్పష్టత లేకుండానే రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. గత ప్రభుత్వం తమకు అనుకూలంగా తయారు చేయించుకున్న విఎంఆర్‌డిఎ మాస్టర్‌ప్లాన్‌ను రద్దుచేసి కొత్తగా తయారుచేయించాలన్న ఆలోచనలో కూటమి ప్రభుత్వం వుంది. దీనిపై ఓ నిర్ణయం తీసుకోవాల్సివుండగానే రోడ్డు విస్తరణపై ఎందుకింత గాబరా అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

అసంపూర్తిగా సచివాలయ భవనాలు

ఇష్టారాజ్యంగా కాంట్రాక్టర్ల పనులు

ప్రజాశక్తి - కొయ్యూరు : గిరిజన ప్రాంతాలలో రాజకీయ నాయకులు, కాంట్రాక్టర్లు, ఇంజనీరింగ్ సిబ్బంది కుమ్మక్కై ప్రభుత్వ ఆశయాలను తుంగలో తొక్కుతున్నారు. రూ.కోట్ల ప్రభుత్వ సొమ్ము మంజూరైనా, అసంపూర్తిగా ఉన్న సచివాలయ నిర్మాణ పనులు ఇందుకు నిదర్శనం. గత వైసిపి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన సచివాలయ వ్యవస్థలో భాగంగా భవన నిర్మాణ పనులు నేటికీ అరకొరగా, దిష్టిబొమ్మల్లా దర్శనమిస్తున్నాయి. సచివాలయ సిబ్బంది పురాతన భవనాల్లో పరాయిపంచన విధులు నిర్వర్తిస్తూ ఇబ్బందులు పడుతున్నా పట్టించుకునే దిక్కులేదు. మండల కేంద్రం కొయ్యూరు, రాజేంద్రపాలెం, చీడిపాలెం తదితర పంచాయతీల్లో అసంపూర్తి సచివాలయాల నిర్మాణాలు కాంట్రాక్టర్, రాజకీయ నాయకులు, ఇంజనీరింగ్ సిబ్బంది అవినీతికి నిలువెత్తు నిదర్శనాలనే విమర్శలు వినిపిస్తున్నాయి. మైదాన ప్రాంతాల నుండి వచ్చి, మన్యంలో మకాం వేసిన కాంట్రాక్టర్లకు ఒక్కో భవనాన్ని రూ.45 లక్షలకతో చేపట్టేలా స్థానిక నేతలు నిర్మాణ బాధ్యతలను అప్పగించారు. ఐదేళ్లవ్యవధిలో అడుతూపాడుతూ కొయ్యూరు సచివాలయ నిర్మాణాన్ని కాంట్రాక్టర్ అరకొరగా కొంత పనిచేయగా, చేసిన పనికంటే ఎక్కువ మొత్తంలోనే బిల్లులను వైసిపి నేతల అండదండలతో ఇంజినీరింగ్ అధికారులు ఇచ్చేశారనే ఆరోపణలూ ఉన్నాయి. అలాగే రాజేంద్రపాలెం పంచాయతీ సచివాలయ భవనం పనులు చివరి దశలో నిలిచిపోయాయి. తర్వాత వీటిని పట్టించుకునే దిక్కు లేకపోవడంతో కొయ్యూరు, రాజేంద్రపాలెం సచివాలయ సిబ్బంది పురాతన భవనాలలో అవస్థలు పడుతూ విధులు నిర్వహిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత యంత్రాంగం స్పందించి, వీటిని పూర్తి చేయాలని కోరుతున్నారు.

అసంపూర్తిగా ఉన్న కొయ్యూరు సచివాలయ భవనం

రామరాజును పరామర్శిస్తున్న సిఐటియు నేతలు, అంగన్వాడీలు

రామరాజుకు పలువురి పరామర్శ

ప్రజాశక్తి-రాజవొమ్మంగి: ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు పుట్టా రామరాజును సిఐటియు, అంగన్వాడీ యూనియన్ జిల్లా నాయకులు సోమవారం ఇంటి వద్ద కలసి పరామర్శించారు. ఇటీవల బైక్ అదుపుతప్పి రోడ్డుపై పడిపోవడంతో రామరాజు తీవ్రంగా గాయపడ్డారు. చికిత్స అనంతరం కోలుకుని, రామరాజు ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న రామరాజును కార్మిక సంఘాలు జిల్లా నాయకులు కె శాంతి రాజు, అంగన్వాడీ నాయకులు కె వెంకటలక్ష్మి, మంగ, రమణి, పలు గ్రామాల అంగన్వాడీ వర్కర్లు, అలాగే సుదూర ప్రాంతంలో ఉన్న 1988 టెన్త్ బ్యాచ్ పూర్వ స్నేహితులు గాడి శ్రీను, నానిబాబు, పి శ్రీను, పి రామలక్ష్మి, హైమా, కె సత్యనారాయణ, నాగేశ్వరరావు, తదితరులు పరామర్శించి ప్రమాదానికి కారణాలు అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో అంగన్వాడి వర్కర్లు సత్యవతి, రత్నం, రాజేశ్వరి పాల్గొన్నారు.

శ్రీరామనవమి ఉత్సవాలకు ముహూర్తపు రాట

ప్రజాశక్తి -సీలేరు: సీలేరులో శ్రీరామనవమి ఉత్సవాలకు రామాలయ ప్రాంగణంలో సోమవారం ఉదయం ముహూర్తపురాట వేశారు. వేద పండితుల మంత్రోచ్ఛారణల నడుమ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ముత్తైదువులతో ముహూర్తపురాట వేశారు. ఈనెల6న ఆదివారం శ్రీరామ వేడుకలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు. శ్రీరామనవమి వేడుకులకు వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ముందస్తు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు.. ముహూర్తపురాట వేడుకలో పాల్గొన్న భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు.

కొనసాగుతున్న 'ఉక్కు' దీక్షలు

ప్రజాశక్తి - ఉక్కునగరం : పోరాటాలతో విశాఖ ఉక్కు కర్మాగారాన్ని కాపాడుకుంటామని సిఐటియు నాయకులు రొంగలి వెంకటరావు అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యాన కూర్మన్నపాలెం కూడలిలో జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు సోమవారానికి 1508వ రోజుకు చేరుకున్నాయి. దీక్షల్లో స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయీస్ యూనియన్ కార్యకర్తలు, ఉక్కు కార్మికులు కూర్చున్నారు. వారినుద్దేశించి ఆయన మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్‌కు కేంద్రం సొంత గనులు కేటాయించాలన్నారు. సెయిల్‌లో విలీనం చేసి పూర్తి ఉత్పత్తి సామర్థ్యంతో నడపాలని డిమాండ్ చేశారు. ఎన్నో ఏళ్ల నుంచి పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులను అకారణంగా ఉద్యోగాల నుంచి తొలగించడం అన్యాయమన్నారు. ప్లాంట్ ఏర్పాటు కోసం భూములు, ఇళ్లను త్యాగం చేసిన నిర్వాసితులకు కర్మాగారంలో ఉద్యోగాలిచ్చి న్యాయం చేయాలన్నారు.

విశాఖ కలెక్టరేట్ : మోడీ ప్రైవేటీకరణ విధానాలను ఉద్యమాలతో తిప్పి కొడతామని ఐద్వా జిల్లా కార్యదర్శి వై.సత్యవతి అన్నారు. స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద విశాఖ అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జెఎసి ఆధ్వర్యాన తలపెట్టిన రిలే దీక్షలు సోమవారానికి 1460వ రోజుకు చేరాయి. దీక్షల్లో ఐద్వా నాయకులు, కార్యకర్తలు కూర్చున్నారు. వారినుద్దేశించి ఆమె మాట్లాడుతూ ఉక్కు కర్మాగారం ప్రైవేటీకరణకు జరుగుతున్న కుట్రలను తెలియజేశారు. శ్రామిక మహిళా సమన్వయ కమిటీ కన్వీనర్ పి.మణి, ఐద్వా జిల్లా నాయకులు కె.కుమారి, బి.భారతి, సుజాత, కె.మణి, బి.సత్యవతి పాల్గొన్నారు.